పండ్ల తోటలలో గణనపై అవగాహన

మేడ్చల్ ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పండ్లు, కూరగాయల గణనచేసే పద్ధతులపై శిక్షణా తరగతులను కలెక్టరేట్‌లో బుధవారం రాష్ట్ర అర్థ గణాంకశాఖ ఉపగణాంకాధికారి కవిత, సహాయ గణాంకాధికారి స్పందన నిర్వహించారు. అనంతరం అలియాబాద్‌లోని పండ్లతోటలో గణనపై వాస్తవ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శిల్ప, స్వప్న, బాలామణి, అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో రుణమాఫీకాని రైతు కుటుంబం వివరాలు యాప్‌లో నిక్షిప్తం చేస్తున్న వ్యవసాయాధికారి లావణ్య

- రుణమాఫీకి రైతుల ఇంటింటికీ వెళ్తున్న అధికారులు
- వర్తించని రైతుల వివరాల నమోదుకు యాప్
- జిల్లాలో ఇప్పటి వరకు హెల్ప్ డెస్క్‌లకు దరఖాస్తుల వెల్లువ
- వికారాబాద్ జిల్లాలో 6709, మేడ్చల్ జిల్లాలో 245 దరఖాస్తుల స్వీకరణ

మాఫీకి మార్గం సుగమం!

రైతు కుటుంబ నిర్ధారణ సర్వే షురూ

ప్రభుత్వం ప్రకటించిన రూ. 2 లక్షల రైతు రుణమాఫీకి అర్హత కలిగి కూడా నోచుకోని రైతుల ఇబ్బందులు గుర్తించిన సర్కారు పరిష్కారానికి చర్యలు చేపట్టింది. అర్హులై ఉండి, రేషన్ కార్డు లేక, లేదా ఇతర కారణాలతో రుణమాఫీ వర్తించని రైతుల వివరాలు నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ రైతుభరోసా పంట రుణమాఫీ యాప్ రూపొందించింది. వ్యవసాయ శాఖ అధికారులు రుణమాఫీ వర్తించని రైతుల ఇళ్లకు వెళ్లి సమాచారాన్ని తెలుసుకుని ఆ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా, రుణమాఫీకి సంబంధించి రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు.



మేడ్చల్‌లో నిర్వహించిన కుటుంబ నిర్ధారణ సర్వే దరఖాస్తులను పరిశీలిస్తున్న మేడ్చల్ జిల్లా అధికారి చంద్రకళ

రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు
నవాబ్‌పేట్	1,127
దౌల్తాబాద్	590
బొంరాస్‌పేట్	508
పరిగి	486
ధారూరు	474
యాలాల్	443
వికారాబాద్	425
పూడూరు	439
మర్పల్లి	333
కొడంగల్	287
దోమ	284
బషీరాబాద్	248
కులకచర్ల	228
మోమిన్‌పేట్	177
తాండూరు	184
పెద్దేముల్	179
కోట్‌పల్లి	175
చౌడాపూర్	66
బంట్వారం	56

మేడ్చల్ జిల్లాలో 245 దరఖాస్తులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మండలాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ల ద్వారా వచ్చిన దరఖాస్తులను అధికారులను పరిశీలించారు. జిల్లాలో అన్ని మండలాల్లో కలిపి 245 దరఖాస్తులు వచ్చాయి. మూడు విడతల్లో 3,260 మంది రైతులకు రుణమాఫీ ద్వారా రూ. 21.80 కోట్లు మాఫీ అయింది. మొదటి విడతలో మొదటి విడతలో 2000 మందికి రూ. 10 కోట్లు మాఫీ కాగా రెండవ విడతలో 886 మందికి రూ. 7.15 కోట్లు మాఫీ, మూడవ విడతలో 374 మందికి రూ. 4.65 కోట్లు మాఫీ అయింది. వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కుటుంబ నిర్ధారణ సర్వే చేపట్టింది.

వికారాబాద్/మేడ్చల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ. 2లక్షల రుణమాఫీ కోసం కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే బుధవారం నుంచి ప్రారంభమైంది. నమోదు చేసిన వివరాలకు సంబంధించి రైతుల నుంచి స్వీయ ధ్రువీకరణ పత్రం తీసుకుని దానిపె పంచాయతీ కార్యదర్శి సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. కాగా, వ్యవసాయ శాఖ రూపొందించిన రైతు భరోసా పంట రుణమాఫీ యాప్ అమలు తీరును ఇది వరకే మండలానికి ఒక గ్రామంలో ఒక కుటుంబం వివరాలు తీసుకుని యాప్‌లో ప్రయోగాత్మకంగా నమోదు చేశారు. రేషన్ కార్డు కలిగి ఉండి రూ. 2 లక్షల రుణ మాఫీ కావడానికి అర్హత ఉన్నా ఎందుకు కాలేదన్న సందేహాలు రైతులను పట్టిపీడిస్తున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రకటించిన రూ.2 లక్షలలోపు రైతు రుణమాఫీకి జిల్లాలో మొత్తం 91,956 మంది రైతులు అరులుగా గుర్తించారు. ఈ రైతులకు రైతు రుణమాఫీ కింద ప్రభుత్వం రూ.766.61 కోట్లు విడుదల చేసింది. మొదటి విడతలో రూ. లక్ష లోపు రుణాలు తీసుకున్న 46,633 మంది రైతులకు రూ.256.26 మాఫీ చేయగా, రెండోవిడతలో రూ.1.50 లక్షలలోపు రుణాలు పొందిన 26,438 మంది రైతులకు రూ.262.64 కోట్లు మాఫీ చేశారు. ఈనెల 15న మూడో విడత కింద జిల్లాలో 18,885 మంది రైతులకు రైతు రుణ మాఫీ కింద రూ. 247.71 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే.



వికారాబాద్ కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్

జిల్లాలో రూ. 2లక్షల లోపు రుణాలు ఉన్న రైతులందరికీ రుణమాఫీ జరగాల్సి ఉండగా, ఇంకా కొందరు రైతులకు వివిధ సాంకేతిక కారణాలతో రుణమాఫీ జరగలేదు. కాగా. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 2 లక్షల రుణమాఫీకి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు అర్హత కలిగి రుణమాఫీ జరగని రైతుల నుంచి వ్యవసాయ శాఖ అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు మండల వ్యవసాయ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో మండలంలో సంబంధిత వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. రైతు రుణమాఫీకి అర్హత ఉండి.. రుణమాఫీ వర్తించని రైతుల నుంచి వారు దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే.

రుణమాఫీ వివరాలు

విడత	రైతులు	మాఫీ (రూ. కోట్లలో)
వికారాబాద్ జిల్లా		
మొదటి విడత	46.633	256.26
రెండవ విడత	26.438	262.64
మూడో విడత	18.885	247.71
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా		
మొదటి విడత	2000	10
రెండవ విడత	886	7.15
మూడో విడత	374	4.65

కుటుంబ నిర్ధారణ సంబంధిత దరఖాస్తులే అధికం

రుణమాఫీ వర్తించని రైతుల కోసం మండల కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు రైతుల నుంచి 6,709 దరఖాస్తులు వచ్చాయి. కుటుంబ నిర్ధారణ సంబంధమైన సమస్యలపై 1,853 దరఖాస్తులు రాగా, రూ. 2లక్షలకు పైగా రుణాలు ఉన్న వారి నుంచి 1,058 దరఖాస్తులు వచ్చాయి. సమగ్ర సమాచారం లేని వారి నుంచి 1,574 దరఖాస్తులు రాగా, ఆధార్ సంబంధిత సమస్యలతో 282 దరఖాస్తులు వచ్చాయి. పేరు పొంతన కాకపోవడం వంటి సమస్యలపై 809 దరఖాస్తులు, బ్యాంకు సమస్యలతో 107 దరఖాస్తులు, పీఏసీఎస్ సంబంధిత సమస్యలతో 320 దరఖాస్తులు వచ్చాయి. పట్టా పాస్ పుస్తకాలకు సంబంధించి 328 దరఖాస్తులు, డీబీటీ సమస్యకు సంబంధించి 211 దరఖాస్తులు, ఇతర సమస్యలకు సంబంధించి 167 దరఖాస్తులు వచ్చాయి.



కొడంగల్‌లో రుణమాఫీ కాలేదని గ్రీవెన్స్‌లో దరఖాస్తులు ఇస్తున్న రైతులు

ఇంటింటికీ వెళ్లి.. వివరాలు నమోదు

రూ.2 లక్షల రైతు రుణమాఫీకి అర్హత ఉన్నా.. వర్తించని రైతుల ఇంటింటికీ వ్యవసాయ అధికారులు వెళ్లి రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం సర్వే నిర్వహిస్తున్నారు. రుణమాఫీ వర్తించని రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి వ్యవసాయ శాఖ రూపొందించిన రైతు భరోసా పంట రుణమాఫీ యాప్‌ను రూపొందించి అమల్లోకి తీసుకువచ్చారు. రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేసినా, దరఖాస్తు చేసుకున్న రైతుల ఇంటికి వ్యవసాయ అధికారులు వెళ్లి వారి బ్యాంకు రుణం తీసుకున్న ఖాతాలు, ఆధార్ కార్డులను పరిశీలిస్తారు. కుటుంబసభ్యుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. రుణాలు ఉన్న భార్యాభర్తలనే కాకుండా 18 ఏళ్లు నిండిన కుటుంబ సభ్యులందరి ఫొటోలు తీసుకుంటారు. కుటుంబ యజమాని తన రుణ ఖాతా, బ్యాంకు వివరాలతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను ఇష్టపూర్వకంగా రాసి ఇస్తున్నట్లు స్వీయ ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. దానిపైన కుటుంబ యజమాని సంతకం చేసి తన మొబైల్ నంబర్ నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే కుటుంబ యజమాని ఇచ్చిన ధ్రువీకరణ పత్రంలోని వివరాలన్నీ ధ్రువీకరిస్తూ పంచాయతీ కార్యదర్శి సంతకం చేయాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- రహదారులపై వర్షపు నీరు నిల్వకుండా చూడాలి
- సమావేశంలో కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : రోడ్లపై వర్షపు నీరు నిలువకుండా, నాలాల పూడికలు తీయడంతో పాటు, వర్షపు నీరు వెళ్లే దారులను క్లియర్ చేయాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రత సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ రోడ్లు, ట్రాఫిక్, మున్సిపాల్టీ, ఆర్ అండ్ బీ, ఎన్‌హెచ్, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని రోడ్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రమాద స్థలాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలిచి ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ట్రాఫిక్ అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో 19 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని ట్రాఫిక్ ఏసీపీ తెలుపగా, నివారణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు. ఈ సంవత్సరం జరిగిన ప్రమాదాలు, మరణాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులకు సంబంధించి ప్రణాళికలు తయారు చేసి నివేదికలు పంపాలని ఆదేశించారు. సంబంధిత అధికారులందరు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. జిల్లా రహదారి భద్రతా అనే అంశంపై పాఠశాల విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి క్యాంపెయిన్లను నిర్వహించాలన్నారు. సమావేశంలో మల్కాజిగిరి ఏసిపి శ్రీనివాసరావు, ట్రాఫిక్ రాచకొండ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ బాలు, ఎన్‌హెచ్ 44 పీడీ ఎల్.ఎస్.రావు, ఆర్ అండ్ బి డీఈఈ సరిత, ఏఈఈ శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కమీషనర్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

650 ఎకరాలు కబ్జా!

- కన్నడిగుల ఆక్రమణలో తెలంగాణ అటవీ భూమి
- తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో సర్వే పూర్తి
- సర్వేతో ప్రాథమికంగా తేల్చిన అటవీశాఖ
- నివేదిక సిద్ధం చేస్తున్న ఆ శాఖ అధికారులు



తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఉన్న అటవీభూముల అక్రమణల సర్వే ప్రాథమికంగా పూర్తయింది. మూడు రోజులుగా తాండూరు అటవీశాఖ అధికారులు సర్వే బృందాలను ఏర్పాటు చేసి కర్ణాటక రైతులు తెలంగాణ అటవీ ప్రాంతలో అక్రమించిన భూభాగాన్ని జీపీఎస్ సర్వేతో నిర్ధారించారు. ఏకంగా 650 ఎకరాలకు పైగా కర్ణాటక రైతులు తెలంగాణ అటవీలోకి చొచ్చుకొచ్చి కబ్జా చేసినట్లు అధికారుల సర్వేలో ప్రాథమికంగా బట్టబయలైంది.

వివరాలు 7లో...

జిల్లా మీదుగా త్రిబుల్‌ఆర్

- ఆ రెండు మండలాలను వికారాబాద్ జిల్లాలోకి మార్చాలి
- సీఎం రేవంత్‌తో పరిగి ఎమ్మెల్యే టీఆర్‌ఆర్ భేటీ
- ఎమ్మెల్యే వినతిపై సీఎం సానుకూలం

పరిగి,ఆగస్టు 28: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని బుధవారం పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీ.రామ్మోహన్‌రెడ్డి కలిశారు. పరిగి నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగ్‌రోడ్‌ను జిల్లాలోని పరిగి,వికారాబాద్ నియోజకవర్గాల మీదుగా వెళ్లే విధంగా డిజైన్ చేయాలని సీఎంను కోరారు. గత ప్రభుత్వహయాంలోనే తాను త్రిబుల్ ఆర్ గురించి పరిగిలో దీక్షలు చేపట్టినట్లు వివరించారు. అలాగే పరిగి నియోజకరవర్గంలోని గండీడ్, మహ్మదాబాద్ మండలాలలు మహబూబ్‌నగర్ జిల్లాలో కొనసాగుతున్నాయని, వాటిని తిరిగి వికారాబాద్ జిల్లాలో కలుపాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎం సానుకూలతను వ్యక్తం చేశారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అప్పా నుంచి మన్నెగూడ వరకు రూ.800 కోట్లతో నిర్మించనున్న నాలుగైన్ల రహదారి పనుల ప్రారంభానికి, పూడూరు రూ.2500 కోట్ల ఏర్పాటు కానున్న నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపనకు రావాలని సీఎం కోరగా, తప్పకుండా వస్తానని హామి ఇచ్చారని, సెప్టెంబర్ రెండోవారంలో అభివృద్ధి పనులకు సీఎం శంకుసాపనలు చేయనున్నారని తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలి

- తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ అలుగు వర్షిణి

వికారాబాద్, ఆగస్టు 28 : పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ అలుగు వర్షిణి అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని కొత్తగడి ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను కలెక్టర్ ప్రతీక్ జైన్‌లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని వంట గది, స్టోర్ రూమ్, పిల్లల విశ్రాంతి గదులు, హాజరు, స్టాక్ రిజిస్టర్, నిల్వలను పరిశీలించారు. వంట గదిని పరిశీలించి పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పిల్లల గదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పిల్లల డార్మిటరీరూమ్‌లను పరిశీలించారు. మంచాలు రెండు భాగాలుగా చేసి పిల్లలకు గాలి, వెలుతురు వచ్చేటట్లు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ. విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని దానికి ప్రపంచాన్ని మార్చే శక్తి ఉందని విద్యార్థులు బాగా చదివి జిల్లకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ క్లియరెన్స్ కోసం బడ్జెట్ అంచనా రిపోర్ట్ పంపించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సెక్రటరీ హన్మంత్ నాయక్, డీసీవో సాయిలత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగడి పాఠశాలలో భోజనం చేస్తున్న అలుగు వర్షిణి

చేప పిల్లలొస్తున్నాయ్!

- టెండర్లు పూర్తి
- సెప్టెంబరులో పంపిణీకి చర్యలు
- నీటి లభ్యతను బట్టి సరఫరా
- మత్స్యకారుల్లో చిగురిస్తున్న ఆశలు



మేడ్చల్ ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల జీవనోపాధికి ఎప్పటి మాదిరిగానే వంద శాతం రాయితీపై చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో మత్స్యకారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రతి ఏటా ఏప్రిల్, మే నెలల్లోనే టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేది. జూలై నుంచి సెప్టెంబరు వరకు చెరువులు, కుంటల్లో నీటి నిల్వ సామార్థ్యాన్ని బట్టి చేప పిల్లలు వదులుతారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకం కొనసాగింపుపై స్పష్టత రాలేదు. దీంతో మత్స్యకారుల్లో సందిగ్ధం నెలకొంది. రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ ఇటీవల ప్రభుత్వానికి చేపపిల్లల సరఫరాకు టెండర్లను ఆహ్వానించారు. ఈనెల 23తో ప్రక్రియ పూర్తయింది. సెప్టెంబర్ నెలలో చేపల పంపిణీకి అధికారులు సిద్ధం చేస్తున్నారు. చెరువులు, కుంటల్లో నీటి లభ్యతను బట్టి పంపిణీ చేస్తారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 82 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. వాటిలో 3738 మంది సభ్యులున్నారు. 2023-24 సంవత్సరంలో 68,05,000 చేప పిల్లలు పంపిణీ జరిగింది. జిల్లాలో చేప పిల్లలను సరఫరా చేసే కాంట్రాక్టర్లు లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కాంట్రాక్టర్లు ఏటా టెండర్లలో అవకాశం దక్కించుకుంటున్నారు. అయితే వీటిని ఆయా సంఘాలకు పంపిణీ చేయడంలో వ్యత్యాసం ఉంటుంది. దీనిపై గతంలో చాలా సార్లు ఫిర్యాదులు సైతం వెళ్లాయి. నిర్దేశించిన లక్ష్యానికి సరిపడా లేక తక్కువ సంఖ్యలో ఇస్తుండటంతో మత్స్యకారులు ఆందోళనకు దిగిన సంఘటనలూ ఉన్నాయి. ఈసారైనా అధికారులు పక్కాగా చర్యలు చేపట్టి నాణ్యమైన విత్తనం పంపిణీ చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. చెరువులు, కుంటల్లో ప్రస్తుతం నీటి లభ్యత అంతంత మాత్రంగానే ఉంది. చాలా చెరువులు బోసిపోయి ఉన్నాయి. ఈ నెలలో సాధారణ వర్షాలు పడితే జలకళ సంతరించుకుంటుంది. సగానికి పైగా నీరుంటేనే పంపిణీకి అవకాశం ఉంటుంది. ఏడేళ్లుగా జరుగుతున్న చేపపిల్లల పంపిణీ ప్రక్రియ సెప్టెంబరు నెలాఖరు వరకు కొనసాగుతోంది.

కనుల పండువగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

మూడుచింతలపల్లి, ఆగస్టు 28: పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపను కనుల పండువగా నిర్వహించారు. మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠను వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తులు కోలాహలంగా నిర్వహించారు. గ్రామాల భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠానంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

వాల్మీకి మహర్షి ఆశయసాధనకు కృషి

దోమ, ఆగస్టు 28: దోమ మండలం బ్రాహ్మణపల్లిలో బుధవారం బోయి సోదరుల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ బోయ కులస్థులు వాల్మీకి మహర్షిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, నర్సప్ప, బోయలు పాల్గొన్నారు.


వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపనలో గ్రామస్థులు

విద్యార్థులు లక్ష్యసాధనలో ముందుండాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 28: విద్యార్థులు లక్ష్య సాధనలో ముందుండేలా నిరంతరం శ్రమించాలని రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.సుధీర్ బాబు అన్నారు. బుధవారం పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ నూతన విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటర్ పూర్తయి బీటెక్‌లో చేరిన తర్వాత విద్యార్థులు స్వేచ్ఛ వచ్చినట్లు భావిస్తారన్నారు. విద్యార్థులకు బీటెక్ మొదటి సవత్సరమే ఎంతో కీలకమన్నారు. ఈ సంవత్సరమే విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయింస్తుందన్నారు. అనుకోని విధంగా మొదటి సంవత్సరం సబ్జెక్టుల్లో ఫెయిలైతే ఆ భారం తదుపరి సంవత్సరాలపై పడుతుందన్నారు. తోటి విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రధానంగా సిగరెట్లు తాగడం, డ్రగ్స్ వినియోగించడం వంటి పనులకు దూరంగా ఉండాలన్నారు. కంపు వాసన వచ్చి, రోగాలకు కారకం అయ్యే సిగరెట్లు ఎందుకు తాగుతారు? అని ప్రశ్నించారు. పలు రాష్ట్రాల వారు, రకరకాల కుటుంబ నేపథ్యాలున్న కుటుంబాల విద్యర్థులు ఒకే క్యాంపస్‌లో చదువుకుంటున్నప్పుడు విచక్షణతో వ్యవహరించాలన్నారు. సమస్యల్లో చిక్కుకోకుండా సజావుగా విద్యాభాసాన్ని పూర్తి చేయాలన్నారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పక ఉండాలన్నారు. మొబైల్ ఫోన్‌ను అవసరానికి ఉపయోగపడే సాధనంగానే చూడాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యారంగంలో రాణించేందుకు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ కె.అభిత్‌రావు, ప్రిన్సిపల్ టీసీహెచ్.శివారెడ్డి, డీన్ కొండయ్య, పూర్వ ప్రిన్సిపల్ నర్సింహారెడ్డి, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఓరియంటేషన్‌లో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి : సీపీ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 28 : పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు సందర్శించారు. పోలీసులు, సిబ్బంది పనితీరును ఆయన అడిగితెలుసుకున్నారు. పీఎస్ పరిధి సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, సీఐ రాజువర్మ, ఎస్ఐలు నాగార్జున్‌రెడ్డి, శివకృష్ణ, కృష్ణయ్య, నాగేశ్వర్‌రావు. యుగేందర్, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు ➤



అగర్‌మియాగూడలో రైతులతో మాట్లాడుతున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

ఫోర్త్‌సిటీతో కందుకూరు మరింత అభివృద్ధి

కందుకూరు, ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఫోర్త్ సిటీతో కందుకూరు ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బేగరికంచ నుంచి అగర్‌మియాగూడ మీదుగా నూతనంగా నిర్మించనున్న రోడ్డుకు భూములు ఇవ్వనున్న రైతులతో బుధవారం సాయంత్రం మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చెరువులు, కుంటలు పూర్తిగా అన్యాక్రాంతమైనట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో అనేక పరిశ్రమలను నెలకొల్పనున్నామని, మహేశ్వరం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందనుందని చెప్పారు. ఆయన వెంట ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేయిస్తున్న యువకులు

చేవెళ్ల, ఆగస్టు 28 : వర్షాలకు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై తరచూ గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్న విషయాన్ని చేవెళ్ల గ్రామానికి చెందిన గుత్తి మల్లేశ్, బండారు శ్రీకాంత్‌రెడ్డి, మడికట్టు నరేశ్‌రెడ్డి తదితరులు గుర్తించారు. ఈమేరకు బుధవారం రెడీ మిక్స్‌తో రోడ్డుపై ఉన్న పెద్ద పెద్ద గుంతలను పూడ్చివేయించారు. కంకర, సిమెంట్‌తో గుంతలను పూడ్చడం పట్ల స్థానికులు, పలువురు వాహనదారులు యువకులను అభినందించారు. కాగా, చేవెళ్ల మండల పరిధిలో ఉన్న ప్రధాన రోడ్లపై గుంతలను పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని, అందుకు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న గుంతలను పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

▸ రాష్ట్ర బీసీ మహాసభ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తీన్మార్ మల్లన్న, కొమ్ము శ్రీనివాస్ యాదవ్

ఆమనగల్లు, ఆగస్టు 28: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర బీసీ మహాసభ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పాలక ప్రభుత్వాలు బీసీల అణచివేత ధోరణి అవలంబిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను హైదరాబాద్‌లో బుధవారం బీసీ సంఘం నాయకులతో కలిసి శ్రీనివాస్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కల్వకుర్తి పట్టణంలో సెప్టెంబరు 2న బీసీల రిజర్వేషన్ల పెంపు కోసం చేపట్టే బీసీ మహాధర్నాకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను మల్లన్నచే ఆవిష్కరించారు. మహాధర్నాకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేసినట్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బీసీల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా బీసీ నేతలంతా హాజరై విజయవంతం చేయాలని శ్రీనివాస్ యాదవ్ కోరారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, మహేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

కడ్తాల్, ఆగస్టు 28: ఆలయాల అభివృద్ధి, భక్తుల సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని బుధవారం ఎమ్మెల్యే సందర్శించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మైసిగండి మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్‌లతో కలిసి మైసమ్మదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు వెంకటేశ్వర్‌రావు, శ్రీరాములు, శ్రీకాంత్ రెడ్డి, జవహర్ లాల్ నాయక్, వెంకటేశ్, యాదిగిరి, తులసీరామ్ నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

చౌదరిగూడ, ఆగస్టు 28: మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా మెర్జింగ్ ప్రక్రియలో మహిళా సంఘాల పాత్ర క్రియాశీలకంగా ఉండాలన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు ఉన్నందున్న మొదటగా తమ పేరు ఓటరు జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా తయారు చేసే క్రమంలో పంచాయతీ కార్యదర్శులుకు సహకరించాలని తెలిపారు. వార్డులోని కుటుంబ సభ్యులంతా ఒకే వార్డులో ఉండేలా తగిన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం నర్సింహ, కోశాధికారి లక్ష్మి, కార్యదర్శి రాణి, సీసీలు రమేష్ దేవయ్య, స్వర్ణలత, సభ్యులు పాల్గొన్నారు.

కబ్జాలో 650 ఎకరాలు

▸ కన్నడిగుల ఆక్రమణలో తెలంగాణ భూమి ▸ తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో సర్వే పూర్తి

బషీరాబాద్/తాండూరు రూరల్, ఆగస్టు 28: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని అటవీ భూముల ఆక్రమణల సర్వే పూర్తయింది. మూడు రోజులుగా తాండూరు అటవీశాఖ అధికారులు జీపీఎస్ సర్వే చేసి అటవీ ప్రాంతాన్ని నిర్ధారించారు. కర్ణాటక రైతులు 650ఎకరాలకుపైగా తెలంగాణ భూభాగంలోకి చొచ్చుకొచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. భూముల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు చెబుతున్నారు. తాండూరు అటవీ రేంజర్ బి.రాజేందర్ 650 ఎకరాలకుపైగా కర్ణాటక రైతులు కబ్జా చేసినట్లు బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. ఈ నెల 26న అటవీ భూములపై ఆంధ్రజ్యోతిలో 'సరిహద్దు సమస్యపై నజర్ శీర్షికన కథనం ప్రచురితమైంది. ప్రభుత్వం బృందాలను ఏర్పాటుచేసి బషీరాబాద్ మండలం మైల్వార్ రిజర్వు ఫారెస్టు సర్వే నంబరు 235, 218/1, ఇస్మాయిల్‌పూర్ పరిధి సర్వే నంబరు 20, నీళ్లపల్లి పరిధి 35లో, జలాల్‌పూర్‌లో సర్వే నంబర్ 69లో వందలాది ఎకరాలను కబ్జా చేసినట్లు అధికారులు తేల్చారు.

సరిహద్దుల్లో తండాల రైతులు

తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని తండాల కన్నడిగులు ఇక్కడి అటవీ భూములను సాగు చేసుకుంటున్నారు. తండాలన్నీ కర్ణాటక రాష్ట్రం సేడం తాలుకాలోకి వస్తాయి. 650 ఎకరాలకు పైగా కర్ణాటక రైతులు తెలంగాణ భూమి ఆక్రమించారు. రెండు రాష్ట్రాల రైతులు భూముల విషయంలో ఘర్షణ పడుతున్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల స్థాయిలో తాండూరు నియోజక వర్గ సరిహద్దు భూముల కబ్జాలపై ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పట్టుబట్టి రంగంలోకి దిగడంతో అటవీ ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. సర్వే రిపోర్టును వారం రోజుల్లో కలెక్టర్ నేతృత్వంలో అటవీశాఖ ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

ప్రభుత్వ అనుమతితో జాయింట్ సర్వే

తెలంగాణలో అటవీ భూముల ఆక్రమణ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో హద్దులను నిర్ణయించేందుకు అటవీ, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టనున్నారు. అటవీశాఖ నివేదిక ఆధారంగా రెండు రాష్ట్రాల అధికారులు జాయింట్ సర్వే చేపడతారు. సర్వేను సెప్టెంబరులో పూర్తిచేసే అవకాశాలున్నాయి. రెండు రాష్ట్రాల కలెక్టర్ల నేతృత్వంలో ఫైనల్ సర్వే చేయనున్నారు.



తెలంగాణ-కర్ణాటక సరిహద్దు అటవీ భూమిలో సర్వే చేస్తున్న అధికారులు

అట్టహాసంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం

▸ సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ



షాద్‌నగర్ అర్బన్ : శివలింగం, నంది, విఘ్నేశ్వరుడు నాగులు, నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 28: ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపురం గ్రామంలో చేపట్టిన దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం నుంచి హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలతో విగ్రహాల ప్రతిష్ఠాపన కొనసాగింది. అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మధురాపురం గ్రామానికి చెందిన మల్కయ్యగారి గోవర్ధన్‌రెడ్డి తన తండ్రి ఎం.రఘురాంరెడ్డి జ్ఞాపకార్థం పంచముఖ శివలింగం, నందీశ్వరుడు, విఘ్నేశ్వరుడు, కుమారస్వామితో పాటు నాగులను ప్రతిష్ఠించారు. లక్నాపురం హరీశ్వర్‌రెడ్డి నవగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ఒంటె విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆల్లగడ్డ నుంచి విగ్రహాలను తీసుకువచ్చి, గత మూడు రోజుల నుంచి వేదపండితుల నిర్వహణలో ప్రత్యేక పూజలు చేసి, ప్రతిష్ఠాపనోత్సవాన్ని కొనసాగించారు. గ్రామ మాజీ సర్పంచ్ ఎల్.శివశంకర్‌రెడ్డితో పాటు అధిక సంఖ్యలో గ్రామస్థులు హాజరై భక్తిని చాటుకున్నారు.

కుందుకూరు మండలం తిమ్మాపురంలో

కందుకూరు : మండలంలోని తిమ్మాపురంలో నూతనంగా నిర్మించిన లలిత శివాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు వేద పండితులు రెవళ్లె రాజుశర్మ ఆధ్వర్యంలో 108 యజ్ఞగుండాలతో హోమం, పూజలు నిర్వహించిన నిర్వాహకులు.. బుధవారం గణపతి, సుబ్రహ్మణ్య, శివ, నంది, శ్రీలలితాత్రిపుర సుందరీదేవి, ఆంజనేయ, నాగ, శిఖర, నవగ్రహ, ధ్వజస్తంభ దేవతా మూర్తుల యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిలు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, వట్నాల ఈశ్వర్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



కేశంపేట : పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, తలసాని వెంకట్‌రెడ్డి

కేశంపేట/తలకొండపల్లి : మండల కేంద్రంలో మూడు రోజులుగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనతో ప్రధాన గట్టం ముగిసింది. కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి సొంత నిధులు దాదాపు రూ.12లక్షలతో గ్రామంలోని దళితవాడలో నూతనంగా పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ విశ్వనాథం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, జమాల్‌ఖాన్, మల్లేష్, నాగేష్, రామచెంద్రి, తదితరులు పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ రూ.25 లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. బుధవారం ఉదయం హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉప్పల వెంకటేశ్‌ను నిర్వాహకులు సత్కరించారు. మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, నాయకులు జగదీశ్వర్, యాదయ్య, సాయిలు, మల్లేశ్, నర్సింహ్మా, రమేశ్, యాదయ్య, భక్తులు పాల్గొన్నారు. కాగా, తలకొండపల్లి శ్రీపోచమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్‌లు సందర్శించారు. పోచమ్మ దేవతకు పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



కందుకూరు: దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేఎల్లార్, తీగల కృష్ణారెడ్డి



తలకొండపల్లి : వేడుకల్లో ఉప్పల వెంకటేశ్



ఆక్రమణలను తక్షణమే తొలగించాలి

▸ బడాబాబుల నుంచి పరిహారం వసూలు చేయాలి

▸ హైడ్రా కమిషనర్‌కు వజ్రేష్‌యాదవ్ వినతి

మేడ్చల్ ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను తొలగించాలని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి, పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జిల్లాతో పాటు మేడ్చల్ మండలం నల్లకుంట చెరువు సర్వే నంబరు 33లో 13ఎకరాల్లో మల్లారెడ్డి సీఎంఆర్ మెడికల్ కాలేజీ, కోమటికుంట సర్వే నంబరు 647లో 20ఎకరాల్లో చేపట్టిన మల్లారెడ్డి యూనివర్సిటీ, నీలా చెరువు సర్వే నంబరు 428లో 5ఎకరాల 30గుంటలు కబ్జా చేసి చేపట్టిన అపర్ణ నిర్మాణాలు, సర్వే నంబరు 29లో 14ఎకరాలు 3గుంటల భూమిలో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. మల్లారెడ్డి అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన నిర్మాణాలు చెరువులు, కుంటల్లో ఉన్నాయని, ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనురాగ్ విద్యా సంస్థలు, నీలిమ హాస్పిటల్ భవనాలను కూడా చెరువులను ఆక్రమించే చేపట్టారని ఆరోపించారు. పూడూరులో ఓ బీజేపీ నేత అల్లుడు చెరువును ఆక్రమించాడని వినతిపత్రంలో వివరించారు. కబ్జాచేసి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేయాలని కోరారు.

వందశాతం రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధం

▸ సాంకేతిక లోపాలను సరిచేయండి

▸ బ్యాంకర్లు, అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



బ్యాంకర్లు, వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 28: సాంకేతిక లోపాలను సరిచేసి, రైతులందరికీ రుణమాఫీ చేసి మళ్లీ రుణం పొందే అర్హతను కల్పించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో బుధవారం బ్యాంకర్లు, వ్యవసాయాధికారులతో రుణమాఫీపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన తెలిపారు. మూడు విడుతల్లో రుణమాఫీ వర్తించని రైతుల పేర్లు, కారణాలను రాసి ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. బ్యాంకర్లు ఇచ్చిన జాబితా ఆధారంగా వ్యవసాయశాఖ అధికారులు నేరుగా రైతులను కలిసి, నివేదికను సిద్ధం చేస్తారని శంకర్ అన్నారు. వ్యవసాయ శాఖకు కాంగ్రెస్ క్యాడర్ కూడా సహకారం అందిస్తుందని తెలిపారు. వ్యవసాయశాఖ ఇచ్చే నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, ప్రతీ రైతుకు రుణమాఫీ అయ్యేలా, తిరిగి మళ్లీ రుణం పొందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. రైతు రుణమాఫీ అంశంపై బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని వీర్లపల్లి శంకర్ సూచించారు.

హిందువులకు వీహెచ్‌పీ వెన్నెముక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సాయిరామ్, తదితరులు

కందుకూరు, ఆగస్టు 28: ప్రతీ హిందువుకు వీహెచ్‌పీ వెన్నెముకలాంటిదని, హిందూ ధర్మం కోసం ప్రతీఒక్కరు రాజకీయాలకతీతంగా కలిసి రావాలని వీహెచ్‌పీ విభాగ్ సంఘటన్ మంత్రి వెలుగు సాయిరామ్ కోరారు. మంగల కేంద్రంలోని సీతారామశాస్త్రీ కల్యాణమండపంలో బీహెచ్‌పీ మండల ప్రఖండ అధ్యక్షుడు ఎగ్గిడి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. వీహెచ్‌పీని స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయ్యిందని గుర్తు చేశారు. లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడారు. వీహెచ్‌పీ రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా దేశ సంస్కృతిపట్ల నిరంతరం పనిచేస్తున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి మధురమోని సురేష్, జిల్లా నాయకులు రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మండల రాజు, కె.నర్సింహ, ఈశ్వర్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం పరుగులు

▸ దరఖాస్తులు అందజేస్తున్న రైతులు



రుణమాఫీ కోసం దరఖాస్తు చేస్తున్న రైతులు

కొడంగల్ రూరల్/కులకచర్ల, ఆగస్టు 28: మూడో విడత 2లక్షల లోపు పంటరుణం మాఫీ కాని రైతులు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. రెండు లక్షల లోపు రుణం తీసుకున్న రైతులు వడ్డీతో కలిపి 2లక్షలకు పైగా ఉందని, అందులో నుంచి 2లక్షలు కూడా మాఫీ కాలేదని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్నారు. భార్యభర్తలు రుణాలను తీసుకున్న వారిలో ఒక్కరికి కూడా మాఫీ కాలేదని మొరపెట్టుకుంటున్నారు. కొందరు పంటరుణం రెన్యూవల్ చేసుకున్న వారికి రుణమాఫీ కాలేదని చెబుతున్నారు. దీంతో కార్యాలయంలోని గ్రీవెన్ సెల్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. మూడు, నాలుగు రోజుల నుంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు రైతులు దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, రుణ ఖాతా స్టేట్‌మెంట్, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను అందజేస్తూ ఫిర్యాదు చేస్తున్నారు. రుణమాఫీ అందలేదని 220మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని కులకచర్ల ఏవో వీరస్వామి తెలిపారు. రుణమాఫీ కాని రైతుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించామన్నారు.

సర్వశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

వికారాబాద్/కొడంగల్ రూరల్, ఆగస్టు 28 : విద్యాశాఖలో వివిధ పోస్టుల్లో పనిచేస్తున్న 21,000 మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్‌లో ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించే చర్యలు తీసుకోవాలన్నారు. ఇచ్చిన మాటను నిలుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, స్వప్నరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కొడంగల్ సమగ్ర శిక్ష ఉద్యోగులు రాఘవేందర్, శ్రీనివాస్, శంకరయ్య, వేణుగోపాల్, నాగరాజ్, వెంకట్‌రావు, కృష్ణ, దస్తప్ప, వెంకటయ్య అన్నారు. వారు కలెక్టరేట్ వద్ద చేసిన నిరసనలో పాల్గొన్నారు.



తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఒసార్ట్ సంస్థ ప్రతినిధులు

పేద విద్యార్థులకు వసతుల కల్పనే ధ్యేయం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 28 : మారుమూల ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పించాలనే సంకల్పంతోనే తమ సంస్థ పాఠశాలల్లో అదనపు తరగతి గదులను నిర్మిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఒసార్ట్(వన్ స్కూల్ ఎట్ ఎ టైమ్) సంస్థ ప్రతినిధి నర్సింహారావు అన్నారు. రూ.కోటితో డబిల్‌పూర్‌లో నిర్మిస్తున్న ఐదు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. యూఎస్‌లో ఉండే ఎన్ఆర్ఐలు, దేశంలోని సాఫ్ట్‌వేర్ సంస్థలు ఈ సంస్థను ఏర్పాటు చేశాయన్నారు. ఇప్పటి వరకు 109 ప్రాజెక్టులు చేపట్టి తరగతి గదులు నిర్మించామన్నారు. 110వ ప్రాజెక్టు కింద డబిల్‌పూర్ పాఠశాలను ఎంపిక చేశామన్నారు. ప్రాజెక్టును డబిల్‌పూర్ స్కూల్లో ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, టీచర్లు సహకరించారన్నారు. ఇక్కడ 400కుపైగా విద్యార్థులున్నారని, వారికి సదుపాలు కల్పించేందుకే ఇక్కడ ప్రాజెక్టును చేపట్టామన్నారు. ఒసార్ట్ సంస్థకు గ్రామస్తులు రుణపడి ఉంటారని మాజీ ఎంపీపీ రజిత, మాజీ సర్పంచ్ గీత అన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రాజమల్లారెడ్డి, భాగ్యరెడ్డి, అశోక్, సత్యనారాయణ, సంజీవయ్య, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

మేడ్చల్ టౌన్, ఆగస్టు 28 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పలువురు లబ్ధిదారులకు బుధవారం కౌన్సిలర్లు జైపాల్ రెడ్డి, బేరి బాల్‌రాజ్, అమరం హేమంత్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వెంకమ్మకు రూ.60వేలు, శివకుమార్‌కు 11,500, చంద్రకళకు 28,500, అయూబ్‌కు 54,000, ఆర్.మహేష్‌కు 9,000 విలువైన చెక్కులకు అందజేశారు. తమ వార్డుల్లో అవసరమున్న ప్రతీ ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం లభించే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కౌన్సిలర్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న గుండ్లపోచంపల్లి కౌన్సిలర్లు

రుణమాఫీ కాని
రైతుల వివరాల సేకరణ



దోమ: గోకఫస్లాబాద్‌లో రుణమాఫీ కోసం రైతు కుటుంబం ఫొటో తీస్తున్న ఏవో

దౌల్తాబాద్/పూడూరు, ఆగస్టు 28 : రైతు రుణమాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరిస్తున్నారు. బుధవారం దౌల్తాబాద్ మడంలంలోని గోకఫస్లాబాద్ గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారి లావణ్య ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేశారు. రెండు లక్షల కంటే ఎక్కువ అప్పు ఉన్న రైతులు మిగతా డబ్బులను బ్యాంకులో చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని ఆమె తెలిపారు. దోమ మడంలంలోని కిష్టాపూర్, బ్రహ్మణపల్లి, పెద్దతండా తదితర గ్రామాల్లో ఏవో ప్రభాకర్‌రావు రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీలో భాగంగానే కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. రుణమాఫీకి అర్హత ఉండి, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ తదితర వాటిలో అప్పులు పడి మాఫీ కాని వారి వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. అర్హులకు త్వరలోనే మాఫీ వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో బాబ్యు, రైతులు పాల్గొన్నారు. పూడూరు మండల పరిధిలో మొదటి విడత రైతు పంట రుణమాఫీ-కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే నిర్వహించారు. చెన్‌గోముల్, అంగడిచిట్టెంపల్లి, పోతిరెడ్డిగూడ గ్రామాల్లో ఏవో తులసీరాం ఆధ్వర్యంలో రైతు కుటుంబీకుల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి అప్పు తీసుకున్న రైతుల వివరాలు తెలుసుకొని నమోదు చేసుకున్నారు. సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.



చెన్‌గోముల్‌లో రైతు కుటుంబ సర్వే నిర్వహిస్తున్న ఏవో, తదితరులు

క్రైం కార్నర్

పోలీస్ స్టేషన్‌కు పందుల పంచాయితీ

బషీరాబాద్, ఆగస్టు 28: పందుల విషయం గొడవకు దారితీసింది. గొడవలో ముగ్గురు కలిసి తమను కర్రలతో కొట్టారని ఓ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కాశీంపూర్‌నకు చెందిన ఎరుకల సాయప్ప, మాణెమ్మ దంపతులు పందులు పెంచుతున్నారు. తాము పందులను వదిలామని నవాల్గకు చెందిన ఎరుకల కాశప్ప, వెంకటప్ప, రాములప్ప కర్రలతో దాడి చేశారన్నారు. కాలు, చేతికి గాయాలయ్యాయని రోదించారు. దీనిపై తాము మూడు రోజుల కిందటే ఫిర్యాదు చేయగా, పోలీసులు వారిని పిలిపించడంలేదన్నారు. రోజూ స్టేషన్‌కు వచ్చి సాయంత్రం వరకు ఉండి వెళ్తున్నామని దంపతులు వాపోయారు. పోలీసులు పట్టించుకోకుంటే తమకు ఎవరు న్యాయం చేస్తారని దంపతులు రోదించారు.



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆవేదన వ్యక్తం చేస్తున్న దంపతులు

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 28: రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందిన ఘటన మేడ్చల్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొక్కొండకు చెందిన రవీందర్ తన కొడుకు సాత్విక్(14)తో బైక్‌పై మేడ్చల్ చెక్‌పోస్టు వైపు వెళ్తుండగా వెనుకనుంచి వ్యాన్ ఢీకొంది. దీంతో రవీందర్, సాత్విక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా సాత్విక్ మృతిచెందాడు. దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

రూ.15లక్షలతో భర్త పరార్!

● పోలీసులను ఆశ్రయించిన భార్య

బషీరాబాద్, ఆగస్టు 28: సాగుభూమి అమ్మగా వచ్చిన రూ.15లక్షలను బ్యాంక్‌లో జమచేస్తానని భార్యను నమ్మించి ఓ భర్త డబ్బుతో పరారా య్యాడు. తన అక్క, భర్త కలిసి చేసిన మోసాన్ని గుర్తించిన సదరు మహిళ బుధవారం పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటన కంసాన్‌పల్లి (ఎం)లో జరిగింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంసాన్‌పల్లికి చెందిన దండోతి హరీశ్వర్, అనురాధ దంపతులకు ఇద్దరు సంతానం. వీరి కుటుంబం హైదరాబాద్‌లో ఉంటూ హరీశ్వర్ ట్యాక్సీ నడుపుతున్నాడు. ఇటీవల గ్రామానికి వచ్చిన హరీశ్వర్ తన ఎకరం భూమి అమ్మగా రూ.21.5లక్షలొచ్చాయి. అందులో కొంత డబ్బుతో అప్పులు తీర్చగా రూ.15లక్షలు మిగిలాయి. ఈ నెల 23న రూ.15లక్షలను తన భార్య పేరిట బ్యాంకులో జమచేస్తానని చెప్పి ఉడాయించాడు. అనుమానంతో అనురాధ తాండూరులోని తన అక్కకు ఫోన్‌చేయగా ఆమె ఫోన్ స్విచాఫ్ వచ్చింది. దీంతో అనురాధ తన అక్క, భర్త పరారైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు రోజుల కిందట అక్క భర్త శాంతు కూడా తన భార్య కన్పించడం లేదని తాండూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రెండు స్టేషన్లలో మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. బుధవారం అనురాధ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు రావడంతో వెలుగులోకొచ్చింది.



తండ్రి, కొడుకుతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన అనురాధ

బాల్య వివాహాలు చేస్తే జైలుశిక్ష, జరిమానా



విద్యార్థినులకు అవగాహన సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ సాజిదా బేగం, సంస్థ ప్రతినిధులు

ధారూరు, ఆగస్టు 28: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని, బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సాహించినా అలాంటి వారికి కోర్టులు జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తాయని తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ధారూరులోని కేజీబీవీ, పోలీసుస్టేషన్లలో బుధవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు లేని దేశం కోస విద్యార్థినులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కేజీబీవీలో జరిగిన సమావేశంలో అధికారి మాట్లాడుతూ అమ్మాయిలకు 18సంవత్సరాలు, అబ్బాయిలకు 21సంవత్సరాలు వయస్సు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలన్నారు. బాల్య వివాహాల బాధ్యులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారని చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నా తమకు సమాచారం ఇవ్వాలని, లేదా 1098 చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్, 100కి డయల్ చేసి సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ధారూరు సీఐ రామకృష్ణ, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్, డీఎల్ఎస్ఏ చీఫ్ అడ్వకేట్ వెంకటేశం, సాధన సంస్థ కార్యనిర్వహకుడు రాహుల్, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి, సాధన, కేఏస్‌సీఎఫ్ సిబ్బంది అంజయ్య, శ్రీనివాస్, కరీం, శివలక్ష్మి, కన్యాకుమారి, అసీమా, మమత, విద్యార్థినులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల అభివృద్ధికి చర్యలు



గురుకుల్ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 28 : గురుకుల్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఘట్‌కేసర్‌లోని గురుకుల్ కళాశాలలో దాత డ్యానో వ్యాక్సిన్ పరిశ్రమ అధినేత డీఎస్ఎన్ రాజు ఆర్థిక సహాయంతో రూ.10లక్షలతో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులకు బుధవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఘన చరిత్ర ఉన్న ఘట్‌కేసర్ గురుకుల పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. దాత సూర్యనారాయణరాజు రూ.10లక్షలు వెచ్చించి అదనపు గదుల నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించి సన్మానించారు. అనంతరం ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెన నిర్మాణ పనులను సుధీర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావనిజంగయ్యయాదవ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, కౌన్సిలర్లు మల్లేష్, రవీందర్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు అబ్బసాని యాదగిరి, మేడబోయిన వెంకటేష్, అంజిరెడ్డి, నాగరాజ్, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రాంచందర్

పరిగి, ఆగస్టు 28:బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాంచందర్ అన్నారు. సభ్యత్వ నమోదుపై బధవారం పరిగిలో కార్యకర్తలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరు 2న దేశ ప్రధాని నరేంద్రమోదీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తారని తెలిపారు. ఆరు నుంచి మండల, అన్ని బూత్ స్థాయిల్లో సభ్యత్వ నమోదు ప్రారంభించాలని సూచించారు. ప్రతీ బూత్‌లో రెండు వందలకు తగ్గకుండా సభ్యత్వాలు చేయించాలన్నారు. పార్టీ ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. 8800002024 నంబరుకు మిస్డ్‌కాల్ ఇస్తే సభ్యత్వ నమోదు పూర్తవుతుందన్నారు. పార్టీ కోసం, సభ్యత్వాల కోసం పనిచేసే కార్యకర్తలను అధిష్ఠానం గుర్తిస్తుందన్నారు. సమావేశంలో సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ శంకర్‌నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, మండల అధ్యక్షుడుశ్రీనివాస్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, టి.రమేశ్, కె.నర్సింహులు, భీమయ్య, గుర్రపు రాజు పాల్గొన్నారు.

చెరువు కబ్జా తొలగింపు

● ప్రహరీని కూల్చిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు



ఎన్కతల చిన్న చెరువులో ప్రహరీని కూల్చివేస్తున్న అధికారులు

మోమిన్‌పేట్, ఆగస్టు 28: మోమిన్‌పేట్ మండలం ఎన్కతలలో సర్వే నంబరు 164లో 18ఎకరాల్లో చిన్న చెరువు ఉంది. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి చెరువు కొమ్ముకు 214 సర్వే నంబరులో భూమి కొన్నాడు. 15 గుంటల చెరువు భూమిని తన భూమిలో కలుపుకొని ఫెన్సింగ్ నిర్మించాడు. దీనిపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయగా గతంలోనే అధికారులు చెరువు భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. మరోసారి ఎన్కతల వాసులు అధికారులకు తెలపగా మంగళ, బుధవారాల్లో ఆక్రమణ ప్రహరీని ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ వరప్రసాద్, గ్రామస్తులు నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, మురళీధర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణదారుతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఏఈ

వెల్ఫేర్ పాఠశాలలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఆగస్టు 28 : సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల(మోమిన్‌పేట/బూర్గుపల్లి)లో ఖాళీల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉషాకిరణ్ తెలిపారు. పీజీటీ ఫిజికల్ సైన్స్, ఇంటర్మీడియెట్ ఒకేషనల్ ఫిజియోథెరపీ, జేఎల్ ఫిజికల్ సైన్స్, డెమోలు టీజీడబ్ల్యూఆర్ఎస్‌జేసీ కొత్తగడి, వికారాబాద్‌లలో ఈ నెల 30న నిర్వహిస్తామన్నారు. డెమో క్లాసులు ఉదయం 9గంటల నుంచి ప్రారంభమవుతాయని, అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లతో రావాలని ఆయన సూచించారు.

1న సత్యసాయి జ్ఞాన కేంద్రం వార్షికోత్సవం

వికారాబాద్, ఆగస్టు 28 : సెప్టెంబర్ 1న సత్యసాయి జ్ఞాన కేంద్రం వార్షికోత్సవం నిర్వహిస్తామని సేవా కేంద్రం నిర్వాహకులు హారతిద్వారకనాథ్, సత్యనారాయణగౌడ్‌లు తెలిపారు. ఉదయం 5గంటలకు నగర సంకీర్త పతకావిష్కరణ, స్వామివారి చింతన, అనంతరం బండెప్పగౌడ్ రాసిన సాయీశ్వర శతక ఆ విష్కరణ, మంగళహారతి, నారాయణ సేవ ఉంటాయన్నారు. కార్యక్రమానికి అతిథులుగా శివకుమార్, పున్నయ్య, పద్మనాభరావు, రామన్న, శ్రీనివాస్, జగదీశ్వర్‌సింగ్‌ఠాగూర్ పాల్గొన్నారు.

గురునాథ్‌రెడ్డిని కలిసిన డీజీపీ



← గురునాథ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న డీజీపీ జితేందర్‌రెడ్డి

కొడంగల్, ఆగస్టు 28: తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డిని డీజీపీ జితేందర్‌రెడ్డి కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో గురునాథ్‌రెడ్డి కార్యాలయంలో డీజీపీ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

బొంరాస్‌పేట్, ఆగస్టు 28: బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 13మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం తహసీల్దార్ దానయ్య చేతుల మీదుగా లగచర్ల, దుద్యాల, కుదురుమళ్ల, గౌరారం, ఆలేడ్, హకీంపేట్, పోలెపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ తదితరులు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మెరుగు వెంకటయ్య, ఖాజమీయ, శ్రీనివాస్‌రెడ్డి, పులేందర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ దానయ్య, నాయకులు

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ నారాయణ రెడ్డి

మోమిన్‌పేట్, ఆగస్టు 28 : జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి బుధవారం మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సందర్శించారు. సీఐ ఆంజనేయులు, ఎస్సై అరవింద్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రోజూ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నవాబుపేట ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్, ఏఎస్సైలు పుండరీకం, వెంకటయ్య, శంకర్, బలరాం, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్, ఆగస్టు 28: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో 2024-25 సంవత్సరానికి డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్టు ప్రిన్సిపాల్ రఫియా ఖానమ్ బుధవారం తెలిపారు. ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. 2015-16 నుంచి 2023-24 వరకు అడ్మిషన్ పొంది ఫీజు చెల్లించని వారు ఈ నెల 31లోపు ఫీజు చెల్లించాలని కోరారు. ఈ అవకాశాన్ని పాత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు కాలేజీలో సంప్రదించాలని ఆమె తెలిపారు.



ప్రిన్సిపాల్ రఫియా ఖానమ్

'ఫ్రెండ్లీ పోలీస్' వాలీబాల్ టోర్నీ

మేడ్చల్ టౌన్, ఆగస్టు 28: మేడ్చల్ ఫ్రెండ్లీ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం పోలీస్ స్టేషన్ పరిధిలోని యువకులకు వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని మేడ్చల్ సీఐ సత్యనారాయణ బుధవారం తెలిపారు. పోటీలు మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తిగల యువకులు తమ జట్లతో పోటీల్లో పాల్గొనాలని సీఐ కోరారు.

విద్యార్థులతో బైక్‌పై నీళ్లు తెప్పిస్తారా?

● డీఈవో ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, ఆగస్టు 28 : విద్యార్థులతో బైక్‌పై నీళ్లు తెప్పిస్తారా? శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు బుధవారం డీఈవో రేణుకాదేవి స్పందించారు. విద్యార్థులకు బైకిచ్చి నీటి కోసం ఎందుకు పంపారని బషీరాబాద్ జడ్పీ స్కూల్ హెచ్ఎంను ఫోన్‌లో ఆరా తీసినట్లు తెలిసింది. వారికేమైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని హెచ్ఎంను ప్రశ్నించినట్లు సమాచారం. ఇలాంటి పనులు మరోసారి చేయొద్దని హెచ్ఎంను డీఈవో మందలించినట్లు తెలిసింది. ఇందుకు హెచ్ఎంతో విచారణ జరిపిన డీఈవో బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించినట్లు సమాచారం.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు

వికారాబాద్, ఆగస్టు 28: ద్విచక్ర వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజు తెలిపారు. బుధవారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో నంబర్ ప్లేట్లు లేని వాహనదారులు, సైలెన్సర్ మార్చి బైక్ నడుపుతున్నవారిని ఆపి అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. యువకులు సైలెన్సర్లు మార్చి సౌండ్ పొల్యూషన్ సృష్టిస్తున్నారని, కొందరూ చాలన్ల నుంచి తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందుస్తుగా అవగాహన కల్పించి విడిచిపెట్టామని పేర్కొన్నారు.

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు

కొడంగల్, ఆగస్టు 28: తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని రెవల్యూషనరీ స్టూడెంట్ ఆర్గనైజేషన్(ఆర్ఎస్‌యు) రాష్ట్ర అధ్యక్షుడు భీమారాజు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారంటే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వస్తాయనే భరోసాతోనే అన్నారు. ఆర్థిక సమస్యలతో ఎంతో మంది మధ్యలోనే చదువు ఆపేస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పట్టించుకోక విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనురాగ్ యూనివర్సిటీలో కనెక్ట్ వెబినార్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 28: వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం అంతర్జాతీయ కనెక్ట్ వెబినార్‌ను నిర్వహించారు. హైదరాబాద్ ఐట్రిపుల్‌ఈ సింగపూర్ వైపీ కనెక్ట్-2024 సంయుక్తంగా ఈ వెబ్‌నార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ మెకానికల్ హెచ్‌వోడీ శ్రీనివాస్ చలపతి మాట్లాడుతూ.. గూగుల్ మీట్‌లో నిర్వహించిన వెబ్‌నార్‌లో సింగపూర్, దేశాల ప్రతినిధులు, ఔత్సాహికులు పాల్గొని సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించారన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి



విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేస్తున్న టీవీవీ నాయకులు

బొంరాస్‌పేట్, ఆగస్టు 28: బొంరాస్‌పేట్ మండలంలోని అల్లిఖాన్‌పల్లి యూపీఎస్ పాఠశాలలో బుధవారం తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, దుద్యాల పాఠశాల హెచ్ఎం విజయరామారావు ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ సహకారంతో విద్యార్థులకు నోటుబుక్‌లు, కంపాక్స్‌లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుతూ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, మల్లప్ప, అశోక్, రాములు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ

కులకచర్ల, ఆగస్టు 28: చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తామని తహసీల్దార్ ప్రభు బుధవారం పేర్కొన్నారు. నేటి మధ్యాహ్నం 2గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి 21మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఎస్బీఐలో అదనపు సిబ్బందిని నియమించాలి

బొంరాస్‌పేట్, ఆగస్టు 28: బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకులో సిబ్బంది కొరత కారణంగా రైతులు, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దళిత ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకు అధికారులకు వారు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకులో సిబ్బంది కొరత కారణంగా బ్యాంకు పరిధిలోని వివిధ గ్రామాల ఖాతాదారులు, రైతులు బ్యాంక్‌లో క్యూలో నిలిచి అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు అదనపు సిబ్బందిని నియమించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



బ్యాంక్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మేడ్చల్ టౌన్, ఆగస్టు 28: మండలంలోని పూడూరు 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని డొమెస్టిక్, ఇండస్ట్రియల్ ఫీడర్ల కింద ఉన్న ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పరిగిలో క్రీడా పోటీలు

పరిగి, ఆగస్టు 28: జాతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని 29న గురువారం పరిగి లెపి ఇండోర్ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.